# 37

# పరిసయ్యులతో ఘర్షణ

## (15:1-20)

యేసు మరియు ఆయన పరిచర్యపట్ల ప్రజలు ప్రదర్శించిన ప్రతిస్పందనలకు సంబంధించిన ప్రధానాంశములను ప్రముఖంగా ప్రకటించుచు ఈ 15వ అధ్యాయం కొనసాగుచున్నది. పరిసయ్యులతో, మానవ కల్పితములైన వారి సాంప్రదాయములను యేసు మరియు ఆయన శిష్యులపై రుద్దుటకు ప్రయత్నించుచుండినవారితో తలెత్తిన సంఘర్షణతో అది మొదలగుచున్నది (15:1–20). అప్పుడు, ఫెనీకే తీరమునకు తిరిగి వెళ్లిన తరువాత, ఆమె కుమార్తె స్వస్థత నొందవలెనని ఆశించుచుండిన అన్యురాలిని యేసు ఎదుర్కొన్నాడు. ఆమె గొప్పది, మరియు మట్టుపెట్టబడజాలని విశ్వాసము కలిగియుండినందునుబట్టి ఆయన ఆమెను ప్రశంసించాడు (15:21–28). యేసు జనసమూహముల మధ్య చేసిన అద్భుతకార్యములతో ఈ అధ్యాయము ముగియుచున్నది (15:29–39). వారు తీసికొనివచ్చిన రోగులను ఆయన స్వస్థపరచుచుండుట వలన ప్రజలు ఇశ్రాయేలు దేవుని స్తుతించునట్లు అది వారిని ప్రేరేపించినది. కనికరము కలిగియుండిన యేసు, ఆయనను వెంబడించుచుండిన వారికి ఆహారము పెట్టాడు, ఈ ఆహారము భుజించినవారిలో నాలుగు వేల మంది పురుషులుండిరి.

### మానవ కల్పితములైన సాంప్రదాయములు, వాటికి వ్యతిరేకముగా దేవుని ధర్మశాస్త్రము (15:1–9)

**1ఆ సమయమున యెరూషలేమునుండి శాస్త్రులును పరిసయ్యులును యేసునొద్దకు**
**వచ్చి 2నీ శిష్యులు చేతులు కడుగుకొనకుండ భోజనము చేయుచున్నారే, వారెందు నిమిత్తము**
**పెద్దల పారంపర్యాచారమును అతిక్రమించుచున్నారని అడిగిరి 3అందుకాయన–మీరును**
**మీపారంపర్యాచారము నిమిత్తమై దేవుని ఆజ్ఞను ఎందుకు అతిక్రమించుచున్నారు?**
**4–తలిదండ్రులను ఘనపరచుమనియు, తండ్రినైనను తల్లినైనను దూషించువాడు తప్పక**
**మరణము పొందవలెననియు దేవుడు సెలవిచ్చెను. 5మీరైతే–ఒకడు తన తండ్రినైనను**
**తల్లినైనను చూచి–నావలన నీకేది ప్రయోజనమగునో అది దేవార్పితమని చెప్పిన యెడల**
**అతడు తన తండ్రినైనను తల్లినైనను ఘనపరచనక్కరలేదని చెప్పుచున్నారు. 6మీరు**
**మీ పారంపర్యాచారము నిమిత్తమై దేవుని వాక్యమును నిరర్థకము చేయుచున్నారు.**
**7-9వేషధారులారా–**

> **ఈ ప్రజలు తమ పెదవులతో నన్ను ఘనపరచుదురు గాని వారి హృదయము నాకు దూరముగా ఉన్నది; మనుష్యులు కల్పించిన పద్ధతులు దైవోపదేశములని బోధించుచు వారు నన్ను వ్యర్థముగా ఆరాధించుచున్నారు**

**అని యెషయా మిమ్మునుగూర్చి ప్రవచించిన మాట సరియే అని వారితో** చెప్పెను.

**వచనము 1. యేసు** పొందుచుండిన ప్రజాదరణ అంతకంతకు నిరంతరము వ్యాపించినది, తత్ఫలితంగా అది గలిలయలోని హేరోదు అంతిపయ సావధానమును మాత్రమే గాక (14:1, 2), **యెరూషలేములో** నుండిన యూదా మత నాయకుల సావధానమును సహితము ఆకర్షించినది. ఆయన తన పరిచర్యను ప్రారంభించినది మొదలుకొని, యేసును వెంబడించుచుండిన వారు యెరూషలేములోను నివసించుచుండిరి (4:25). అప్పటికే, ఆయన ఈ పరిశుద్ధ పట్టణమును రెండు పర్యాయములు సందర్శించాడు (యోహాను 2:13; 5:1).

పాలస్తీనాలో నానావిధములై యుండిన యేసు కదలికల గూర్చి నిగూఢంగా విచారించి తెలిసికొని వారికి తెలియజేయునట్లు, యెరూషలేములోని నాయకులు వారి ప్రతినిధులను పంపుచుండిరి (యోహాను 1:19–28 చూడు). అంతకు మునుపు, ఆయన సుంకరులతోను పాపులతోను కలిసి భోజనము చేయుచు, తద్వారా వారి సబ్బాతు సాంప్రదాయమును ఉల్లంఘించినప్పుడు, అది గలిలయలోని స్థానిక నాయకులను ఆయనకు విరోధముగా రెచ్చగొట్టినది (9:11, 34; 12:2, 14). ఆయన యొద్దకు తేబడిన వానికి పాప క్షమాపణను ప్రకటించుటద్వారా కూడ ఆయన వారి మనస్సులకు గాయము కలిగించాడు (9:2, 3) కాబట్టి, అప్పటికే యేసు ఉపదేశములను ఒక బెదిరింపుగా పరిగణించినవారై, యెరూషలేములోని నాయకులు ఆయనను అపఖ్యాతి పాలుజేయ నుద్దేశించి ఒక బృందమును గలిలయకు పంపించారు. మార్కు వ్రాసిన సువార్త ప్రకారము, అంతకు మునుపటి సంఘర్షణ–యేసు బయెల్జెబూలు చేత పట్టబడినవాడై యున్నాడని ఆయన నిందింపబడిన సంఘటన కూడ యెరూషలేములో అదివరకే మాటుగా ఉంచబడిన దళము ద్వారా తలెత్తినది (మార్కు 3:22; మత్తయి 9:34; 12:24 చూడు). వారి ప్రయత్నములు గతములో కంటె ఇప్పుడు మరి ఎక్కువ సఫలీకృతముగా ఫలించునని ఈ యూదా మత నాయకులు నిస్సందేహముగా నిరీక్షించియుండిరి.

యెరూషలేములో నుండి పంపబడినవారిలో కొందరు **శాస్త్రులై** యున్నారని గుర్తింపబడినది. వీరు పాత నిబంధన లేఖనములు, అంతమాత్రమేగాక ఇతర చట్టపరమైన దస్తావేజుల నకలులు వ్రాయుచుండెడివారు. వారు పవిత్రమైన ఈ గ్రంథపాఠములతో సుపరిచితులై యుండుటనుబట్టి, వారు లేఖనముల ముఖ్య వ్యాఖ్యానకర్తలయ్యారు (2:4; 5:20; 7:29). వారు "న్యాయావాదులు" (NASB) అనియు (22:35), "ధర్మశాస్త్రోపదేశకులు" అనియు (లూకా 5:17) పిలువబడిరి. వారి ఉద్యోగమునుబట్టి, వారు ధర్మశాస్త్రమును గూర్చిన తెలివిలో ప్రత్యేక గుర్తింపు పొందరి.

**పరిసయ్యులు** ("వేరుచేయబడినవారు") యూదులలో అతి పెద్ద విభాగమై యుండిరి. వారు ఆ నాటి న్యాయబద్ధీకరణవాదులై యుండి (23:1–10 చూడు), వ్రాతమూలకంగా నుండిన ధర్మశాస్త్రమును మరియు మౌళిక సాంప్రదాయములను గట్టిగా హత్తుకొనుచుండింరి. వారు అంతియొకయ ఎఫిఫనేస్ పరిపాలనా కాలములో యూదుల మధ్య గ్రీకు సంస్కృతికి ప్రోత్సాహకమియ్యబడుటకు వ్యతిరేకముగా చేలరేగారు.[1] వారు సర్వసాధారణంగా, సద్దూకయ్యులకు తారతమ్యంగా ఆత్మ యొక్క పునరుత్థానము మరియు అమరత్వ సిద్ధాంతములను గట్టిగా హత్తుకొనుచుండిరి. వారు భవిష్యత్ ప్రతిఫలము మరియు శిక్ష సిద్ధాంతమును సహితము విశ్వసించారు (అపొస్తలుల కార్యములు 23:8; 3:7పై గల

వ్యాఖ్యానమును చూడు). పరిసయ్యులందరు శాస్త్రులై యుండలేకపోగా, శాస్త్రులలో అధిక సంఖ్యాకులు పరిసయ్యులకు సంబంధించిన పక్షములో సభ్యులై యుండిరి.[2]

**వచనము 2.** శాస్త్రులు మరియు పరిసయ్యులు యేసు నడిగిన ప్రశ్న, వారు సమాచారము కొరకు చేసిన మనవి కంటె ఎక్కువగా ఆయనపై ఒక నింద మోపడమై యుండినది. మరొక పర్యాయము. యేసు తానే భోజనమునకు ముందు శిష్టాచారము ప్రకారము కడుగుకొన నందుకు ఒక పరిసయ్యుడు తన ఆశ్చర్యమును ప్రదర్శించాడు (లూకా 11:38).

యూదా మత బోధకులు వారి విద్యార్థుల నడవడి విషయంలో బాధ్యులై యున్నారని ఎంచబడినది గనుక, ఆయన **శిష్యుల** చర్యలనుబట్టి యేసు విమర్శింపబడ్డాడు (9:14; 12:2 చూడు). నిస్సంశయముగా శిష్యుల ప్రవర్తన యేసు చేయుచుండిన ఉపదేశములకును ఆయన ప్రదర్శించుచుండిన మాదిరికిని సంబంధించినదై యుండినది. వారు ఎంతో కాలము ఒక సాంప్రదాయముగా పాటింపబడుచుండిన విధానమునకు వ్యతిరేతముగా ప్రవర్తించుచుండినందు వలన, వారి చర్యలు అనాలోచితమైనవనిగాని లేదా అది వారి బలహీనతయై యుండినదనిగాని చెప్పుకొనుటకు అవకాశములు అతి తక్కువ, కానీ అవి యేసు వారికి ఉపదేశించుచుండిన ఉపదేశముల నుండి కలిగిన బుద్ధిపూర్వకమైన చర్యలై యుండినట్లు అగుపించుచుండినది. వారు చేయుచుండినదేమిటో, ఒక నియామానుసారంగా వారు చేయుచుండిరి, అంతే గాని వారి నిర్లక్ష్యమునుబట్టి కాదు. కనీసము, పరిసయ్యులు మరియు శాస్త్రులు తర్కించవలసిన తీరు ఇదై యుండవలెను.[3]

పరిసయ్యులు మరియు శాస్త్రులు వారి తీర్పునకు **పెద్దల పారంపర్యాచారమును** ప్రామాణికముగా ప్రయోగించుచుండిరి. "పారంపర్యాచారము" (*paradosis*) అను పదము ఒకరి నుండి మరొకరికి "అప్పగింపబడిన" లేక "అందజేయబడిన లేఖనముల అనువాదములను సూచించుచున్నది. అతడు యేసు క్రీస్తును అంగీకరించక మునుపు, పౌలు ఒక పరిసయ్యుడుగా పెంచబడినవాడై యుండెను, గనుక ఆయన "తన పితరుల పారంపర్యాచారమందు" విశేషాసక్తిగలవాడై యుండెను (గలతీయులకు 1:14; NIV).

బబులోను చెర తరువాత, యూదుల ఉపదేశకుల ప్రజలు వారి అనుదిన జీవితములను వారి అధీనంలో ఉంచుకొనుటకు అనేక సూక్ష్మాతి సూక్ష్మాంశముల గూర్చి పట్టుదల గల నియమమును వ్యవస్థాపించారు. ధర్మశాస్త్రమును మరి ఎక్కువ సలక్షణముగా అర్థనిర్ధారణ చేయుట ఈ నియమముల ఉద్దేశమై యుండినది. గతములో యూదుల పతనమునకు హేతువైన పాపములు పునరావృతము కాకుండుటకు కూడ అవి ప్రయోజనపడినవి. "ధర్మశాస్త్రమును కాపాడుటకు దాని చుట్టూర నుండు కంచెగా" నుండుటకే అవి ఉద్దేశింపబడినవి.[4] శతాబ్దాలుగా మౌఖిక ధర్మశాస్త్రమును సీనాయి పర్వతముపై పొందాడనియు, ఆ తరువాత అవి ఇశ్రాయేలీయుల పెద్దల ద్వారా తరువాతి తరమునకు అందజేయబడినవనియు యూదా మత బోధకులు సాధికారముతో చెప్పుకొన్నారు.[5]

అట్లయినప్పటికిని, ఈ సాంప్రదాయములను యూదులందరు అంగీకరించలేదు. ధర్మశాస్త్రము ఎంత ఖచ్చితంగా అనుసరణీయమైనదై యున్నదో, ఈ సాంప్రదాయములు సహితము అంతే ఖచ్చితంగా అనుసరణీయమైనవై యున్నవని శాస్త్రులలోను పరిసయ్యులలోను అధిక సంఖ్యాకులు యోచించాయి. ఏదిఏమైనా, సద్దూకయ్యులు వాటిని తృణీకరించారు, గనుక "స్వదేశస్థులు," సామాన్య జనులై యుండినవారు, వాటిని పాటించుటకు ఎక్కువ

పట్టింపు చూపలేదు.[6] జోసీఫస్ ఈ క్రింది విధంగా వ్రాసాడు,

> పరిసయ్యులు ప్రజలకు అనేక ఆచరణలను వంశపారంపర్యంగా వారి పితరుల నుండి అందించారు, అవి మోషే ధర్మశాస్త్రములో గ్రంథస్థంచేయబడలేదు; గనుక ఈ హేతువు మూలంగా సద్దూకయ్యులు వీటిని తృణీకరించుచు మనము *వ్రాత మూలకంగా* ఉన్న వాక్యములో గల ఆచరణలు తప్పనిసరిగా ఆచరింపబడవలసినవై యున్నవని వాటిని గౌరవించవలసి యున్నది, కానీ *మన పితరుల నుండి ఉత్పన్నమైన సాంప్రదాయములను* మనము పాటించకూడదని చెప్పుదురు; గనుక ఈ విషయములకు సంబంధించినంత వరకు వారి మధ్య గొప్ప వివాదములు మరియు భిన్నాభిప్రాయములు తలెత్తినవి, ఇది ఇలా ఉండగా సద్దూకయ్యలు ధనవంతులను గాక యింకెవరినైనను బలవంతము చేయుటలేదు … , కానీ జనసమూహములు పరిసయ్యుల పక్షమున నున్నారు.[7]

కొంత కాలమైన తరువాత, మానవ కల్పితములైన ఈ సాంప్రదాయములు దేవుని వాక్యము కంటె ఎక్కువ ప్రాదాన్యతను సంతరించుకొనుట మొదలయ్యింది. వ్రాతమూలకంగా ఉన్న నియమముల కంటె ఎక్కువ ప్రాధాన్యత మౌఖిక నియమములకు యివ్వబడినదని అటుతరువాతి నివేదికలు తెలియజెప్పుచున్నవి.[8]

వారు ప్రభువు శిష్యులకు వ్యతిరేకముగా మోపిన నిందలో, ఉల్లంఘింపబడుచుండినది వారి మౌఖిక సాంప్రదాయమే, కానీ వ్రాత మూలకంగా ఉన్న ధర్మశాస్త్రములోని ఒక్క ఆజ్ఞయైనను కాదను వాస్తవమును దాచిపెట్టుటకు శాస్త్రులు మరియు పరిసయ్యులు ప్రయత్నించలేదు. శిష్యులు **చేతులు కడుగుకొనకుండ భోజనము చేయుచున్నారని** వారు శిష్యులను విమర్శించారు వ్యక్తిగత ఆరోగ్య సూత్రాలపై ఆసక్తిగలవారై ఆ నిందారోపణ చేయలేదు.దానికి మారుగా, శిష్టాచార పవిత్రతకు సంబంధించిన సాంప్రదాయములను అడ్డుపెట్టుకొని చేసారు. ప్రభువును విమర్శించినవారి హేతువులు ఈ విధంగా ఉన్నవి: దైనందిన పనులలో ఎవరైనను ఏదైన మలినమైన విషయాలను ముట్టుకొను అవకాశములు కలవు. గనుక భోజన సమయములో ఆరగించుటకు అతడు **రొట్టెను** చేత పట్టుకొనినప్పుడు, ఆ రొట్టె అపవిత్రమైనదగును. అప్పుడు, వాడు ఆ రొట్టెను భుజించినప్పుడు, అతని శరీరమంతయు అపవిత్రమైనదగును. ఇటవంటి శిష్టాచార మలినమునకు దూరముగా నుండునట్లు, భోజనమునకు ముందు అతడు తన చేతులను కడుగుకొనవలెను (మార్కు 7:3, 4 చూడు).[9]

మిశ్నాలోని (Mishnah) ఒక చిన్న పుస్తకమంతయు, *Yadaim* ("చేతులు"), చేతులు కడుగుకొనుట గూర్చి మాత్రమే తెలియజెప్పుటకు కేటాయింపబడి, అట్టి అంశము యొక్క గాంభీర్యతను ప్రదర్శించుచున్నది. చేతులను ఏ యే విషయములు మలినము చేయును, కడుగుకొను నిమిత్తము ఏ యే పాత్రలను ఉపయోగించవచ్చును, పవిత్రీకరించునవి ఏ రకమైనవి, అవి ఎన్ని, ఏది సరైన కడుగుకొను విధానము మొదలగు విషయాలు అందులో చర్చింపబడి యున్నవి ఉదాహరణ వ్రేళ్లు ఊర్ధ్వముఖమునకు పెట్టినవైయుండునట్లు చేతులుంచబడవలెను, నీళ్లు మణికట్టు క్రిందుగా జారునట్లు ఆ చేతుల మీద నీళ్లు పోయబడవలెనని ఆ చిన్నపుస్తకము తెలియజెప్పుచున్నది. ఆ తరువాత, వ్రేళ్లు అధోముఖమునకు పెట్టినవై యుండునట్లు చూచుకొని వాటి మీద నీళ్లు పోయబడవలెను.[10]

నిర్దిష్టముగా ఇశ్రాయేలీయుల యాజకులకు ఇవ్వబడిన శాసనము సామాన్య ప్రజానీకము

అభ్యసించుటకు సముచితమైనదై యుండునట్లు శాస్త్రులు మరియు పరిసయ్యులు దానిని అనుకూలించుకొని యుండవచ్చును. నిర్గమకాండము 30:17-21 ప్రకారము, వారు బల్యర్పణ కృతులను మొదలుపెట్టక మునుపు యాజకులు తమ చేతులను మరియు కాళ్లను ఇత్తడి గంగాళములో కడుగుకొనవలెనని దేవుడు సెలవిచ్చాడు. గనుక చేతులను శిష్టాచార నియమము చొప్పున కడుగుకొనుట ద్వారా, సామాన్యులు "వారి అనుదిన ఆహారము దేవాలయములోని బలిపీఠముపై నున్న ఒక బల్యర్పణయని భావించుచు దానిని ఆరగించెదరని" పరిసయ్యులు విశ్వసించారు.[11] ఈ వాడుక, ఇటువంటి అనేక ఇతర వాడుకల వలెనే, దేవుని యెదుట ప్రజల పరిశుద్ధత పదిలముగా విషయమును ధ్రువీకరించును.

**వచనము 3.** యూదుల సాంప్రదాయములు మౌళిక శాసనమును మోషే మరియు సీనాయి పర్వతముతో ముడిపెట్టుచుండినప్పటికిని, అది అధికారసహితమైనదై యున్నట్లు యేసు దానిని దృష్టించలేదని స్పష్టమగుచున్నది. ఏది ఏమైనా, శిష్టాచార సంబంధముగా చేతులు కడుగుకొనవలసిన సమస్య గూర్చి ఆయన వాదోపవాదములు చేయలేదు. దానికి మారుగా, ఆయన వారిపై తన సొంత నిందను ఆరోపించాడు. సరైన యూదా మత బోధకుల శైలిలో, యేసు వారి ప్రశ్నకు మరొక ప్రశ్నతో ప్రత్యుత్తరమిచ్చాడు: **మీరును మీ పారంపర్యాచారము నిమిత్తమై దేవుని ఆజ్ఞను ఎందుకు అతిక్రమించుచున్నారు?** "మీరును" అను అనువాదములో గ్రీకు గ్రంథపాఠము యొక్క ఉద్ఘాటింపు స్వభావము వెలికి తీయబడినది; యేసు పరిసయ్యులనే వ్రేలెత్తి చూపించుచుండెను. అంతమాత్రమేగాక, వారి మౌఖిక సాంప్రదాయములను వారు, అవి దేవుని లిఖితపూర్వకమైన ప్రత్యక్షత కంటే ఎక్కువ ప్రధాన్యమైనవని ఎంచుచుండిరి.

**వచనము 4.** ఆయన వారికి తెలియజెప్పుచుండిన విషయము యింకా ఎక్కువ మంచి ప్రభావమును కనుపరచునదై యుండునట్లు, శాస్త్రులకును పరిసయ్యులకును వారి సొంత అభ్యాసములో నుండే ఒక సోదాహరణ చిత్రీకరణమును నివేదించాడు. వారు ఐదవ ఆజ్ఞను ఉల్లఘించుచుండిరి, ఈ ఆజ్ఞలో దేవుడు, **నీ తండ్రిని, నీ తల్లిని సన్మానించుము అని దేవుడు సెలవిచ్చాడు** (నిర్గమకాండము 20:12; మత్తయి 19:19; ఎఫెసీయులకు 6:2, 3 చూడు). ఈ ఆజ్ఞకు, యేసు మరొక ఆజ్ఞను, తన తలిదండ్రులను సన్మానించనివానికి వేయబడు జరిమానాను తెలియజెప్పు ఆజ్ఞను చేర్చాడు: **తండ్రినైనను తల్లినైనను దూషించువాడు తప్పక మరణము పొందవలెను** (నిర్గమకాండము 21:17; లేవీయకాండము 20:9).

"సన్మానించుము" అను పదమును అలుముకొనియున్న వివరములన్నింటిని ధర్మశాస్త్రము నిర్దిష్టముగా తెలియజెప్పలేదు. ఏది ఏమైనా, అందులో ఆర్థిక సహాయమందించుట చేరియున్నదని స్పష్టమగుచున్నది (1 తిమోతి 5:4 చూడు). క్రీస్తు కాలములో సామాజిక సంక్షేమ పద్ధతి యూదులలో లేకుండినది. కానీ తమ తల్లిదండ్రులు తమ్మును తాము పోషించుకొనలేనంతటి వృద్ధాప్య దశ చేరుకొన్నప్పుడు పిల్లలు వారి అవసరములను సమకూర్చుదురని భావింబడినది. తన తండ్రికి ఆహారపానీయాదులు సమకూర్చుచు, వస్త్రములిచ్చుచు, దుప్పటి కప్పుచు, లోనికిని వెలుపలకును నడిపించుచు, అతని ముఖము మరియు కాళ్లు చేతులు కడుగుట, అది కుమారుని బాధ్యతయై యున్నదని యూదా మత బోధకులు చెప్పుచుండిన ఒక సాంప్రదాయము చెప్పుచున్నది.[12] ఎట్టిపరిస్థితులలోనైనను,

చివరకు వాడు బిచ్చమెత్తవలసి వచ్చినప్పటికిని, కుమారుడు తన తండ్రిని పోషించ బద్ధుడైయున్నాడని మరొక పారంపర్యాచారము చెప్పుచున్నది.[13] 5 మరియు 6వ వచనములో, "నీ తండ్రిని మరియు నీ తల్లిని సన్మానించుమను" ఆజ్ఞను ప్రభువు సుస్పష్టముగా, అనగా ప్రేమ మరియు గౌరవము మాత్రమే కాదు, కానీ అవసరమై యుండు ఆర్థిక సహాయమును సహితము అందించవలెనని నిర్వచించాడు.

**వచనములు 5, 6. మీరైతే ... చెప్పుచున్నాయి** అను పదజాలము, 4వ వచనములోని "... అని దేవుడు సెలవిచ్చెను" అను మాటలకు ఎంతో తారతమ్యముగా నున్నది. ఈ మూడు మాటలతో, యేసు పరిసయ్యులను దేవునికి సూటిగా వ్యతిరేకమైన స్థానములో ఉంచాడు. "నీ తండ్రిని మరియు నీ తల్లిని సన్మానించుమని" దేవుడు ఆజ్ఞాపించియుండగా, శపథములకు సంబంధించిన వారి తీర్పులలో, **ఒకడు తన తండ్రిని లేక తన తల్లిని సన్మానించకూడదని** పరిసయ్యులు నియమించారు (ఉద్ఘాటింపును గమనించండి).

వారి తలిదండ్రులకు సహాయము చేయవలసిన బాధ్యత నుండి తప్పించుకొనునట్లు, **నావలన నీకేది ప్రయోజనకరమగునో అది దేవార్పితమని** అవిధేయుడైన యూదుడు ఒట్టుపెట్టుకొనును. గ్రీకు గ్రంథపాఠములో "ప్రతిఫలము" (*dōron*), తరుచుగా బల్యర్పణ సంబంధిత బహుమానములను మరియు దేవాలయములో అర్పింపబడిన అర్పణలను సూచించు ఒక పదము కలదు (5:23, 24; 8:4; 23:18, 19; లూకా 21:1, 4). మార్కు వ్రాసిన సువార్తలో *dōron* తో పాటు, "కొర్బాను" (*korban*) అను మరొక పదము వాడబడినది (మార్కు 7:11). ఈ సాంకేతిక పదము, హెబ్రీ భాషలో నుండిన గ్రీకు భాషలోనికి (అటుతరువాత, ఆంగ్లము లోనికి) యథాతర్థముగా ప్రతిలేఖనము చేయబడిన పదము, దేవునికి ఒక బహుమతిగా వ్రతము చేసికొనబడిన ఏదో ఒక విషయమును సూచించినది. దీనికి సంబంధించిన నామవాచక పదము *korbanas* "దేవాలయ బొక్కసము" విషయంలో ప్రయోగింబడినది (27:6).

కొన్ని సొత్తులను యూదులు తరుచుగా "కొర్బాన్"గా గుర్తించుచుండిరి. ఏది ఏమైనా, ఇవి ఎల్లప్పుడు దేవాలయ బొక్కసములో కనీసము సొంతదారుని జీవితకాలమంతటిలోనైనా అర్పింపబడలేదు. వాటి పేర్లు పేర్కొనబడిన వస్తువులు/విషయములు లౌకిక ఉద్దేశముల కొరకు, ఒకని తల్లిదండ్రుల పోషణకొరకైనా కూడ, వాడబడుటను ఇటువంటి వ్రతములు నిషేధించినవి. ప్రస్తుత సందర్భములో, ఒకడు (బహుశా కోపముతో) వృద్ధులైన తన తల్లిదండ్రుల పోషణ కొరకు ఉపయోగింపబడవలసిన తన వనరులను ఉద్ధేశపూర్వకముగా దేవునికి ప్రతిష్ఠింపవచ్చును. ఇటువంటి శపథము చేసిన ఒకని గూర్చినది, వాని వలన వాని తండ్రికి ప్రయోజనపడవలసిన ఎటువంటి సహాయమునైనను నిషేధించినవాని గూర్చిన ఉదాహరణమును మిశ్నా తెలియజెప్పుచున్నది.[14]

శపథములు నిబద్ధతతో కూడినవై యుండినందు వలన (సంఖ్యాకాండము 30:2; ద్వితీయోపదేశకాండము 23:21–23), (దేవుడు ఆజ్ఞాపించినట్లుగా) వారి తల్లింద్రులకు సహాయపడునట్లు, ఏదైన ఒక శపథమును (అనగా, మానవ సాంప్రదాయిక శపథమును) ఉల్లంఘించినవారు ఒక తీవ్రమైన పాపము చేయుచున్నారని వారిని పరిసయ్యులు నిందించియుందురు.[15] కాలక్రమేపి, ఈ విషయమును గూర్చిన ఆలోచనలు మారిపోయినట్లు అగుపించుచున్నది. *Korban* శపిథమునకును, ఒకడు తన తలిదండ్రుల యెడల

కలిగియున్న కర్తవ్యమునకును మధ్య ఘర్షణ ఏర్పడినట్లయితే, అట్టి శపథమును మిశ్నా[16] కొట్టివేయుచున్న ధ్వనింపునిచ్చుచున్నట్లు అగుపించుచున్నది.[17]

మీ **పారంపర్యాచారము**, అని చెప్పినప్పుడు పరిసయ్యులు **దేవుని వాక్యమును నిరర్థకమునుచేయుచున్నారని** యేసు సెలవిచ్చాడు. "నిరర్థకముచేయుట" (*akuroō*) ఒక చట్టపరమైన పదమై యున్నది, "అశక్తునిచేయుట" అని దాని అర్థము. ఏబి అనువాదము యేసు పలికిన మాటలను ఈ విధముగా భావానువాదము చేయుచున్నది: "మీరు దేవుని వాక్యమును ప్రక్కకు పె(నె)ట్టేసారు–దాని శక్తిని మరియు అధికారమును పూర్తిగా తీసివేసి దానిని సార్థకముకానిదానిగా చేసారు."

**వచనము 7**. యేసు ఈ యూదా మత నాయకులను **వేషధారులారా** అని సంబోధించుచున్నాడు (6:2, 5 పైగల వ్యాఖ్యానమును చూడు). వారు దేవుని నియమమును నిలబెట్టుచున్నట్లుగా నటించారు, కానీ వాస్తవమునకు వారు దానిని వ్యతిరేకించుచుండిరి. శపథములు కలిగియుండిన నిబద్ధతా స్వభావమునకు వారు తోడ్పడ్డారు, కానీ అవి ప్రథమంగా దేవునికి మహిమ తెచ్చునవై యుండుటకు ఉద్దేశింపబడినవి. ఏది ఏమైనా, ఒకని తల్లితండ్రులకు సహాయము లేదా తోడ్పడవలసిన పని లేదన్న శపథములు స్వార్థపూరితమైన ఆసక్తుల వలన చేసికొనబడినవి. ఇటువంటి శపథములను సమర్థించుట ద్వారా, పరిసయ్యులు దేవునిని మరియు ఆయన ధర్మశాస్త్రమును అగౌరవపర్చుచుండిరి.

యెషయా 29:13లోని ఉల్లేఖనమును ఉల్లేఖించి చెప్పుచు యేసు తన సమాధానమును సంపూర్తి చేసాడు. ఆయన ఉల్లేఖించి చెప్పిన ఉల్లేఖనమునకు గల ఉపోద్ఘాతము గట్టి గద్దింపుతో కూడినదై యుండినది: **అని యెషయా మిమ్మును గూర్చి ప్రవచించిన మాట సరియే.** యెషయా ప్రవక్త ఈ మాటలను ప్రాథమికంగా తన కాలమందలి ఇశ్రాయేలీయుల నుద్దేశించి పలికాడు, మరియు దేవుని చేత ప్రేరేపింపబడినవాడై ఆయన పలికిన పలుకులు, యేసు సూచించినట్లుగా, మొదటి శతాబ్దము నాటి యూదులకు సహితము వర్తించినవి (అపొస్తలుల కార్యములు 28:25–27 చూడు). "చరిత్ర, మరొక మాటలో చెప్పుకొన్నట్లయితే, ఇదివరకటి చరిత్రయే ఇప్పుడు పునరావృత్తమగుచున్నదని" విల్యమ్ హెండ్రిక్సెన్ వ్యాఖ్యానించాడు.[18]

**వచనము 8. ఈ ప్రజలు తన పెదవులతో నన్ను ఘనపరచుదురు, గాని వారి హృదయము నాకు దూరముగా ఉన్నది.** పాత నిబంధనలోని ఈ వాక్యభాగమును యేసు ఉపయోగించుకొనుచు, అది పంచుకొనుచున్న "ఘనపరచుట" అను పదము చేత ఈ సంఘటనను జోడించాడు. ఆయన శిష్యులు పారంపర్యాచారమును గౌరవించలేదనునది వారి నిందారోపణయై యుండినది. వారు తమ తల్లిదండ్రులను ఘనపరచవలసి యున్నదను ఆజ్ఞ దిశగా యేసు వారి మనస్సులను మళ్లించాడు. తల్లిదండ్రులు వారి పిల్లల చేత ఘనపరచబడవలెనని దేవుడు ఆజ్ఞ ఇచ్చాడు. పరిసయ్యులు మరియు శాస్త్రులు వారి పారంపర్యాచారమును ఘనపర్చారు, కానీ తమ తల్లిదండ్రులను నటనాత్మకంగా మాత్రమే ఘనుర్చారు (15:4 చూడు).[19] నిజమైన దైవభక్తి అన్నిటిని మించి దేవుని ప్రేమించు యథార్థమైన హృదయములో నుండి ఉద్భవిస్తోంది (ద్వితీయోపదేశకాండము 6:5; మత్తయి 22:37, 38).

**వచనము 9. మనుష్యులు కల్పించిన పద్ధతులు దైవోపదేశములని బోధించుచు**

**వారు నన్ను వ్యర్థముగా ఆరాధించుచున్నారు.** "వ్యర్థము" (*matēn*) అనగా, "నిష్ఫలము" లేక "దేనికిని ప్రయోజనపడని" అని అర్థము. విగ్రహారాధన ఇటువంటి పదముల చేత చిత్రీకరింపబడినది ("వ్యర్థమైనవి"; అపొస్తలుల కార్యములు 14:15). ఇంకా, తన నాలుకను అదుపుచేసికొనని క్రైస్తవుని దైవభక్తి "వ్యర్థమే" అని వర్ణింపబడినది (యాకోబు 1:26).

ఈ వచనములోని భాష దేవుడు ఆయనకు అర్పింపబడు ఏ విధమైన ఆరాధననైననూ అంగీకరించునను ఆధునిక తప్పుడభిప్రాయమును బయటపెట్టుచున్నది. ఆది నుండి కూడ, ప్రజలు ఆయన కట్టడల ప్రకారము మాత్రమే యథార్థమైన హృదయులై ఆయనను ఆరాధించవలెనని ఆయన కోరుచున్నాడు (ఆదికాండము 4:1–8).

ఈ సందర్భములో, వారు దేవుని ధర్మశాస్త్రమునకు ప్రత్యామ్నాయముగా మానవ కల్పితములైన పారంపర్యాచార్యములను ప్రయోగించుచుండి నందులకు యేసు శాస్త్రులను మరియు పరిసయ్యులను తీవ్రముగా దండించాడు. సామాన్య ప్రజానీకము పాటించవలెనని వారు ఉపదేశించుచుండిన విషయముల ద్వారా వారి దైవభక్తి నిరర్థకమైనదని ప్రస్ఫుటముగా తెలియుచుండినది. గ్రీకు భాషలో, "దైవోపదేశములని బోధించుట" అను పదజాలములో (*didaskontes didaskalias*) పునఃరుక్తము గావింపబడుట చేరియున్నది గనుక అది "బోధలను బోధించుట" అని అక్షరార్థముగా అనువదింపబడవచ్చును. పారంపర్యాచారములు కొంత కాలము తరువాత ఒక నియమమగుటకును, తద్వారా దేవుని నియమములలో కలుగజేసుకొనుటకును ఉన్ముఖత కలదు, అయితే సకల పారంపర్యాచారములు చెడ్డవి కావు.

ఈ చిన్న సంఘటనలో, యేసు పారంపర్యాచారములన్నింటిని ఖండించుటలేదు. దేవుని ఆరాధించుటకు సమాజమందిరములోనికి వెళ్లుట, భోజనమునకు ముందు కృతజ్ఞతా స్తోత్రములు చెల్లించుట, పస్కా భోజనము చేయక ముందు సుత్తి సంకీర్తనములు (113–118) పాడుట మొదలగు పారంపర్యాచారములను ఆయన పాటించాడు. ఏదిఏమైనా, పారంపర్యాచారము ఒక శాసనమని చెప్పుచు, దానికి దేవుని శాసనములతో సమాన హోదా కల్పించుచు, దాని యెడల నిబద్ధతను చేపట్టుట తప్పని ఆయన నిరూపించుచు దానిని ప్రతిఘటించుచుండెను.[20]

## అసలైన మలినము (15:10–20)

**10జనసమూహములను పిలచి–మీరు విని గ్రహించుడి; 11నోటపడునది మనుష్యుని అపవిత్రపరచదు గాని నోటనుండి వచ్చునదియే మనుష్యుని అపవిత్రపరచునని వారితో చెప్పెను.**

**12అంతట ఆయన శిష్యులు వచ్చి–పరిసయ్యులు ఆ మాట విని అభ్యంతరపడిరని నీకు తెలియునా అని ఆయనను అడుగగా 13ఆయన పరలోకమందున్న నా తండ్రి నాటని ప్రతి మొక్కయు పెల్లగింపబడును. 14వారి జోలికి పోకుడి; వారు గ్రుడ్డివారైయుండి గ్రుడ్డివారికి త్రోవ చూపువారు. గ్రుడ్డివాడు గ్రుడ్డివానికి త్రోవ చూపిన యెడల వారిద్దరు గుంటలో పడుదురు గదా అనెను. 15అందుకు–పేతురు ఈ ఉపమానభావము మాకు తెలుపుమని ఆయనను అడుగగా 16ఆయన–మీరును ఇంతవరకు అవివేకులైయున్నారా? 17నోటిలోనికి**

**పోవునదంతయు కడుపులోపడి బహిర్భూమిలో విడువబడును గాని [18]నోటనుండి బయటికి వచ్చునవి హృదయములో నుండి వచ్చును; ఇవే మనుష్యుని అపవిత్రపరచునవని మీరు గ్రహింపరా? [19]దురాలోచనలు నరహత్యలు వ్యభిచారములు వేశ్యాగమనములు దొంగతనములు అబద్ధసాక్ష్యములు దేవదూషణలు హృదయములో నుండియే వచ్చును [20]ఇవే మనుష్యుని అపవిత్రపరచును గాని చేతులు కడుగు కొనక భోజనముచేయుట మనుష్యుని అపవిత్రపరచదని చెప్పెను.**

మత్తయి వ్రాసిన సువార్తలోని ఈ విభాగము (15:1-20) పురోగతి చెందుచుండగా, యేసును వెంబడించుచుండిన శ్రోతలు నిరంతరము మారిపోవుచుండిరి. మొదట, మానవ కల్పితములైన పారంపర్యాచారములను గూర్చి ఆయన యూదా మత నాయకులతో తర్కించాడు (15:1-9). ఆ తరువాత ఆయన అసలైన ఆధ్యాత్మిక మలినము గూర్చి జనసమూహములతో మాటలాడాడు (15:10, 11). ముగింపులో, ఆయన చేసిన వాంగ్మూలముల గూర్చి తన శిష్యులకు సవివరంగా వివరించాడు (15:12-20).

**వచనము 10**. **యేసును** చుట్టుముట్టి యుండిన **జనసమూహములలో** అనేకులు 14:34-36లో పేర్కొనబడిన గుంపునకు, ఆయన చేయుచుండిన అద్భుతకార్యములను కళ్లారా చూచినవారి గుంపునకు లేదా వారు స్వస్థత నొందవలెనని ఆయన యొద్దకు వారు తీసికొనివచ్చిన వారి ప్రియులకు చెందియుండవచ్చును. వారు సమీపమున నున్న ఏదో ఒక చోట నిలుచుండి యేసు మరియు యూదా మత నాయకులకు చెప్పిన విషయాలను విడమర్చి చెప్పగలుగునట్లు వారిని దగ్గరకు **పిలిచాడు**. యేసు వారడిగిన పారంపర్యాచారములకు సంబంధించిన పెద్ద ప్రశ్న గూర్చి మాత్రమే చర్చించాడు (15:2ఎ). ఈ సందర్భములో, ఆయన శిష్టాచార సంబంధమైన చేతులు కడుగుకొనుట గూర్చి యింకా ఎక్కువ నిర్దిష్టముగా చర్చించాడు (15:2బి).

**విని గ్రహించుడి** అను అభివ్యక్తము యేసు, "నేను ఉపదేశించుచున్న విషయములను బహు జాగ్రత్తగా వినండి, అర్థంచేసికొనండి" అని తెలియజెప్పుచుండిన విధానమై యుండినది (11:15; 13:9, 43 చూడు). యేసు బోధలు, ఒకడు భోజనము చేయుటకు ముందు చేతులు కడుగుకొనుట శిష్టాచారముగా చిరకాలాచారణమై గౌరవింపబడిన పారంపర్యాచారమునకు స్పష్టముగా తారతమ్యమైనవై యుండినందు వలన, ఈ వివరమును గ్రహించుటకు లేదా ఆయన బోధను అంగీకరించుటకు వారిలో అనేకులకు కష్టముగా నుండును.

**వచనము 11. నోటపడునది మనుష్యుని అపవిత్రపరచదు, గాని నోట నుండి వచ్చునదియే, మనుష్యుని అపవిత్రపరచునని** యేసు సెలవిచ్చాడు. ఈ "ఉపమానము" ద్వారా (15:15), ఒకడు దేవుని దృష్టికోణంలో ఎలా అపవిత్రుడౌతాడో ప్రభువు విశదీకరించాడు. పారంపర్యాచార సంబంధమైన శాస్త్రులు మరియు పరిసయ్యుల స్థానమును ఆయన ఒప్పుకొనలేదు, ఏలయనగా అది శిష్టాచార సంబంధమైన అపవిత్రతను నొక్కివక్కాణించుచుండినది. ఒకడు తన నోటిలోనికి పెట్టుకొనునదేదియు వానిని ఆధ్యాత్మికముగా అపవిత్రము చేయదనునది ఆయన బోధయై యుండెను. పరిశుద్ధత వెలుపటి నుండి రాదు, కానీ అది అంతర్యములో నుండి వెలుపలికి వచ్చును (23:25-

28). చెడు, హృదయము లోపల నుండే పుట్టి, ఆ తరువాత అది ఒకని నోటి మాటలలో దర్శనమిచ్చును (12:34, 35; 15:19, 20; ఎఫెసీయులకు 4:29; యాకోబు 3:6).

**వచనము 12. యేసు మాటలు విని పరిసయ్యులు అభ్యంతరపడిరని** ఆందోళన చెందుచున్నవారై, **శిష్యులు** యేసు యొద్దకు వచ్చారు. "అభ్యంతరపడిరి" అను అర్థమిచ్చుచున్న గ్రీకు పదము (*skandalizō*) తరుచుగా "పాపము చేయునట్లు చేయును" అని అర్థమిచ్చును. ఏది ఏమైనా, ఇచ్చటి పదము నిష్క్రియా పదమై యున్నది గనుక అది "కలవరపడుట," "దిగ్భ్రాంతి చెందుట," లేక "కోపము తెచ్చుకొనుట" అని అర్థమిచ్చుచున్నది. ఈ వచనమునకు ముందున్న వచనములలో గల యేసు ఉపదేశించిన అనేక విషయములు నిస్సందేహముగా పరిసయ్యులకు అభ్యంతరకారకములై యుండినవి, "ఆ మాట," సందర్భానుసారంగా, 11వ వచనంలోని విషయాన్ని సూచించుచున్నది. వారు సూక్ష్మాతి సూక్ష్మముగా పాటించుచుండిన ఆచార సంబంధమైన చేతులు కడుగుకొనుట గూర్చిన విషయము, ఏ మాత్రమున్నా, అతి తక్కువ ఆధ్యాత్మిక విలువగలదై యున్నదని అది తెలియజెప్పుచున్నది. ఈ అభ్యాసము–వారు అతిశయించుటకు గొప్ప అవగాహననిచ్చిన అభ్యాసము–సమయము మరియు శక్తిని వృథాచేయుటయై యుండినది. వారి దైవభక్తిలో ఆంతర్యములోని పవిత్రతకు బదులుగా వెలుపటి ఆచార కృతులు చేరియుండినవి. వారి పారంపర్యాచారముల గౌరవమును తగ్గించుచు, పరిసయ్యుల అధికారమే అల్పమైన విలువగలదని యేసు ఉద్ఘాటించుచుండెను.

ఈ నాయకుల ప్రతిస్పందన గూర్చి చింతించుచున్నవారై శిష్యులు వారి ఆధ్యాత్మిక పరిపక్వతను బయలుపర్చారు. యేసు రాజకీయపరమైన తప్పులేమి గూర్చి చింతించలేదు; ఆయన చింతించుచుండినదంతా సత్యము గూర్చే. ఆయన మాటలు పరిసయ్యులకు అభ్యంతర కారణంగా ఉండునని ఆయనకు తెలియును. సత్యము, కొన్ని పర్యాయములు గాయము చేస్తోంది. వాస్తవమునకు, అది తరుచుగా ప్రజల్లో అభ్యంతరము కలుగజేస్తోంది. సత్యమును ఎల్లప్పుడు ప్రేమ పూర్వకముగా పలుకవలెను, పంచుకొనవలెను (ఎఫెసీయులకు 4:15), అయితే రక్షణ సత్యము తప్పనిసరిగా తెలియజెప్పబడవలసినదే, లేదంటే గొప్ప హాని కలుగును (1 తిమోతి 2:4).

**వచనము 13. పరలోకమందున్న నా తండ్రి నాటని ప్రతి మొక్కయు పెల్లగింపబడునని** పలుకుచు యేసు తన శిష్యుల ఆందోళనను తొలగించాడు. తండ్రి నుండి కలుగనిది అది ఏదైనను ఎంతో కాలం నిలువనేరదనునది ఈ వాంగ్మూలము యొక్క ప్రధానాంశమై యున్నది. "పరలోకమందున్న నా తండ్రి" అను పదజాలము యేసు మరియు దేవునికి గల సన్నిహిత సంబంధమును సూచించుచున్నది (18:35 చూడు). ఈ సంబంధమునుబట్టియే, యూదా మత నాయకుల గూర్చి యేసు అధికారముతో మాటలాడగలిగాడు (7:28, 29 చూడు).

"ప్రతి మొక్కయు" అను పదజాలము పరిసయ్యుల చేత బోధింపబడుచుండిన అబద్ధ సిద్ధాంతములను సూచింపవచ్చును. మానవ కల్పితములైన ఈ పారంపర్యాచారములు దేవుడు నాటని మొక్కలై యుండినవి. గనుక అవి దేవుని సత్యము చేత పెల్లగింపబడును, ఏలయనగా ఆయన సత్యము తరతరములు నిలుచును. అంటు నిత్య సత్యము యేసు పరిచర్య ద్వారా బయలుపర్చబడుచుండినది.

"ప్రతి మొక్కయు" అను పదజాలము పరిసయ్యులను, వారి పారంపర్యాచారములను దేవుని వాక్యముతో మార్పిడి చేసుకొనుచుండినవారిని కూడ సూచించుట సాధ్యమే. పాత నిబంధనలో, దేవుని జనులు "మొక్క" ఆయన చేత "నాటబడుచున్న మొక్క" అని ప్రస్తావింపబడిరి (యెషయా 5:2, 7; 60:21; 61:3; యెహెజ్కేలు 17:22, 23). నాటబడుట మరియు పెల్లగింపబడుట గూర్చిన మనఃకల్పన యిర్మీయా గ్రంథంలో ముఖ్యముగా ప్రస్ఫుటమైనదై యున్నది (యిర్మీయా 1:10; 2:21; 11:17; 12:2; 18:7, 9; 24:6; 31:28; 32:41; 42:10; 45:4). "ప్రతి మొక్కయు" అను పదజాలము పరిసయ్యులను సూచించుచున్నట్లయితే, "పెల్లగింపబడును" అను పదజాలము వారి తీర్పును సూచించుచున్నది (3:7-12; 13:24-30, 36-43 చూడు). దీని అర్థములో ఈ రెండు దృక్పథములు కూడ కలిసియున్నవి.

**వచనము 14. వారి జోలికి పోకుడి** అని చెప్పుచు యేసు తన శిష్యులను హెచ్చరించుచుండెను. శిష్యులు పరిసయ్యుల హోదాను గాని లేదా వారి అభిరుచులను గాని కాపాడవలసిన అవసరం వారికి లేదు (15:12). వారు ఈ మతసంబంధమైన వారికి దూరముగా ఉండవలెను, ఏలయనగా వారి వలన వీరికి ప్రయోజనమేమియు లేదు. యేసు "పరిసయ్యుల పులిసిన పిండిని" గూర్చి అనగా, వారి బోధల గూర్చి తన శిష్యులను అటుతరువాత హెచ్చరించాడు (16:11, 12) పరిసయ్యులు యూదా ప్రజలపై ప్రదర్శించుచుండిన ప్రభావమునుబట్టియే ఆయన తన శిష్యులను హెచ్చరించవలసిన అవసరం ఏర్పడినదని తెలియవచ్చుచున్నది (యోహాను 7:13; 9:22; 12:42; 19:38, 39).

వారు "గ్రుడ్డివారికి త్రోవచూపువారై," ఆధ్యాత్మిక అంధారములో ఉండిన వారికి జ్యోతులై యుండిరని పరిసయ్యులు తమ్మును తామే ఎంచుకొనుచుండిరి (రోమీయులకు 2:19). వారు **గ్రుడ్డివారికి త్రోవ చూపు గ్రుడ్డివారై** యుండిరని చెప్పుటకు యేసు ఈ వక్కాణింపును ఉపయోగించాడు (23:16, 24; యోహాను 9:39, 40 చూడు). మొదటి శతాబ్దము నాటి పాలస్తీనా దేశంలో కంటి జబ్బులు ప్రబలముగా ప్రబలియుండినందు వలన, అంధులై యుండిన బిచ్చగాళ్ల సంఖ్య అధికంగా ఉండినది.[21] తత్ఫలితంగా, వీరు ఒక చోటి నుండి మరొక చోటికి వెళ్లుటకు వీరికి ఇతరుల సహాయం అవసరమయ్యింది. **వారిద్దరును గుంటలో పడుదురు** (లూకా 6:39 చూడు). ఈ సత్యము పరిసయ్యులకే తెలియదు, గనుక వారు ఇతరులను నాశనకరమగు గుంటలోనికి నడిపించుచుండిరి. ఒకడు ఒక అబద్ధ ఉపదేశకుని అనుసరించుచన్నట్లయితే, ఉపదేశకుడు ఖండింపబడును కాని ఆతనిని అనుసరించువారు కాదని కొందరు నమ్ముదురు. అయితే సత్యమును అంగీకరించవలసిన బాధ్యత ఉపదేశకునిపైనను, అతనిని అనుసరించువానిపైనను ఉన్నదని యేసు ఉపదేశించాడు.

**వచనము 15.** అప్పుడు పేతురు, **ఈ ఉపమాన భావము మాకు తెలుపుము** అని యేసును అడిగాడు. అనేక సందర్భములలో, పేతురు శిష్యులందరి ప్రతినిధిగా ప్రవర్తించాడు (14:28పై గల వ్యాఖ్యానము చూడు). పేతురు, మొక్క పెల్లగింపబడుటకు సంబంధించిన ప్రకృతి గూర్చి ప్రస్తావించుచుండెనా? (15:13) లేక, గ్రుడ్డివాడు గ్రుడ్డివానికి త్రోవ చూపుట గూర్చియా (15:14)? ఈ విషయంలో యేసు ఇచ్చిన ప్రత్యుతరము

(15:16-20), "నోటపడునది మనుష్యుని అపవిత్రపరచదు, గాని నోట నుండి వచ్చునదియే, మనుష్యుని అపవిత్రపరపచునను" అంతకు మునుపటి ప్రకటనను పేతురు పరోక్షంగా ప్రస్తావించుచుండెనని సూచించుచున్నది (15:11). ఇచ్చటి "ఉపమానము" (*parabolē*) అను పదము ఒక సమస్యాత్మకమైన లోకోక్తిగా ఉంటున్నది. ఆయన చెప్పిన ఉపమానములను యేసు తరుచుగా వారు ఏకాంత ప్రదేశములందు ఉన్నప్పుడు తన శిష్యులకు విశదీకరించాడు (13:36; మార్కు 4:34).

**వచనము 16. యేసు, మీరును ఇంతవరకు అవివేకులైయున్నారా?** అని తన శిష్యులను ప్రశ్నించాడు. వారు యేసుతో కూడ చాలా కాలం నుండి ఉంటున్నందువలన, ఆయన జీవిత శైలిని గమనించుచు ఆయన బోధలు వినుచుండినందు వలన, వారి గ్రహింపులో వారు ఎంతో అభివృద్ధిచెందియుందురని అయన ఆశించాడు. యేసు తన శిష్యులనడిగిన ప్రశ్న, వారిలో కొరతగా ఉండిన ఆధ్యాత్మిక విచక్షణ విషయంలో, ఒక బలమైన నిరసనయై యున్నదని మనము ఎంచవలెనా? లేక దానిని ఒక సుకుమారమైన గద్దింపుగా గణించవలెనా? ఆయన తన శిష్యుల అవగాహన గూర్చి ఎంతో నిరాశచెందాడను దానితో నిమిత్తము లేకుండా, యేసు ఆ ఉపమాన భావమును వారికి ఎంతో సహనముతో విశదీకరించాడు.

**వచనము 17.** యేసు మొదటి ఉపమానము యొక్క మొదటి వాక్యమును వివరించాడు: "నోటపడునది మనుష్యుని అపవిత్రపరచదు" (15:11ఎ). ఈ సమయంలో, **నోటిలోనికి పోవునదంతయు కడుపులో పడి బహిర్భూమిలో విడువబడును కదా?** అని ఆయన వారినడిగాడు. శిష్టాచార పవిత్రత కొరకు మాత్రమే చేతులు కడుగుకొనుట యను పరిసయ్యుల పారంపర్యాచారము శారీరక ప్రపంచమునకు సంబంధించిన విషయమై యున్నది. కడుగుకొనని చేతులతో పట్టుకొనబడిన ఆహార పదార్థము "నోటిలోకిపోయి," ఆ తరువాత "కడుపులో" జీర్ణించుకొనబడి, ఆ తరువాత మానవ వ్యర్థపదార్థముగా బహిర్భూమిలో "విడువబడును," అట్టి ఆహారపదార్థము *aphedrōn*లో, అనగా "మరుగుదొడ్డి"లో (JNT) విడువబడునని గ్రీకు గ్రంథ పాఠము చెప్పుచున్నది. కడుగుకొనని చేతులతో భోజనము చేయుట వలన ఒకని హృదయము ప్రభావితము కాదని యేసు ప్రభువు నొక్కివక్కాణించుచుండెను (మార్కు 7:18, 19).

**వచనము 18.** ఆయన చేసిన తరువాత గమనికతో, ఆయన ఉపమానములోని రెండవ వాక్యమును విశదీకరించాడు: "నోటినుండి బయటికి వచ్చునవి, హృదయములో నుండి వచ్చును, ఇవే మనుష్యుని అపవిత్రపరచును" (15:11బి). ఒకని నోటి మాటలు వాని **హృదయము లోపల నుండి వచ్చుననియు**, ఇవి ఆధ్యాత్మిక అపవిత్రతను కలుగజేయగలవనియు ఆయన పిడివాదం చేయుచుండినట్లు నొక్కిచెప్పుచుండెను. "హృదయము" (*kardia*)ఒకని అంతరంగ జీవిత కేంద్రముగా ఉంటున్నది; అది ఒకని అనుభూతులు, ఆలోచనలను, మనసాక్షిని, మరియు చిత్తమును సూచించుచున్నది (5:8; 6:21పై గల వ్యాఖ్యానము చూడు). మత్తయి వ్రాసిన సువార్తలో ఇంతకు మునుపు, యేసు పరిసయ్యులను ఈ మాటలతో గద్దించాడు: "సర్పసంతానమా, మీరు చెడ్డవారైయుండి, ఏలాగు మంచి మాటలు పలుకగలరు? హృదయమందు నిండియుండు దానినిబట్టి నోరు మాటలాడును గదా" (12:34). ఒకని హృదయము నిర్మలమైనదిగా ఉన్నప్పుడు, వాని నోటిమాటలు కూడ నిర్మలమైనవిగా ఉండును. వాని హృదయము చెడ్డదై యున్నప్పుడు,

వాని నోటిమాటలు సహితము చెడ్డవై యుండును.

**వచనము 19.** యేసు క్రీస్తు **హృదయము** లోపల నుండి పుట్టుకొనివచ్చు ఇతర దుర్మార్గముల జాబితాను తెలియజెప్పుచు తన విశదీకరణను కొనసాగించాడు. ఈ జాబితాలో, **చెడ్డ ఆలోచనలు** మినహాయించి, ఆయన పది ఆజ్ఞలలోని రెండవ భాగమును, సాటి మానవుల మధ్య నుండు సంబంధములకు సంబంధించిన విషయాలను- అనుసరించాడు: **నరహత్యలు, వ్యభిచారములు, వేశ్యాగమనములు, దొంగతనములు, అబద్ధ సాక్ష్యములు, మరియు దేవదూషణలు** (నిర్గమకాండము 20:13-16).[22] ఇవే పాపములు క్రొత్త నిబంధనలోని ఇతర వాక్యభాగములలో పేర్కొనబడి యున్నవి (1 కొరింథీయులకు 6:9, 10; ప్రకటన 9:21; 21:8; 22:15). పాపములు హృదయములో పుట్టునని యేసు అదివరకే కొండ మీద నుండి చేసిన ప్రసంగములో ఉపదేశించాడు (5:21-48).

**వచనము 20. ఇవే మనుష్యుని అపవిత్రపరచును; గాని చేతులు కడుగుకొనక భోజనము చేయుట మనుష్యుని అపవిత్రపరచదని** చెప్పుచు ప్రభువు తన శిష్యులకు తెలియజెప్పుచుండిన విశదీకరణమును ముగించాడు. నిజమైన పవిత్రత, దాని స్వభావములో అది ఆధ్యాత్మికమైనవై యున్నది; దానిలో ఒకని హృదయము-వాని ఆలోచనలు, భావోద్రేకములు, మనసాక్షి, మరియు వాని చిత్తము-నిహితమై యున్నది. ఈ అర్థనిర్ణయము పరిసయ్యులు శిష్టాచార పవిత్రత గూర్చి కలిగియుండిన చింతనకు విపరీతముగా తారతమ్యమైనదై యున్నది. కడుగుకొనబడని చేతుల గూర్చిన యేసు తుది తీర్పు, చివరకు 15:2లో ఆయన శిష్యులకు వ్యతిరేకముగా చేయబడిన ఆరోపణ యొక్క మొదటికే వచ్చుచున్నది గనుక, మత్తయి సువార్తికుడు నివేదించుచున్నట్లు, అది ఒక తలంపుగా రుపుదిద్దుకొనుచున్నది (15:1-20).[23]

✧✧✧✧✧ **పాఠములు** ✧✧✧✧✧

### పరలోక మార్గములోని అడ్డంకులు (15వ అధ్యాయం)

నేటి ఐహిక లోక మనస్తత్వమును మనము తొలగించుకొని, మనము పరలోకములో ప్రవేశించకుండా అడ్డుపడగల అడ్డంకులను తొలగించుకొనవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. ఈ అడ్డంకులు కొన్నింటిని మనము పరిశీలనగా పరీక్షించుదాము.

1. *మానవులు కల్పించు పారంపర్యాచారములు* (15:1-9). దేవుని చిత్తమునకు అనుకూలముగా లేని మానవ కల్పితములైన పారంపర్యాచారములను మనము తృణీకరించవలెను. మనము దేవుని అధికారము, ఆయన వాక్యమే ("... అని దేవుడు సెలవిచ్చెను"). "మీరైతే ... అని చెప్పుచున్నారని" యేసు పరిసయ్యులతోను శాస్త్రులతోను చెప్పాడు (15:4, 5). వారు, "వారి పారంపర్యాచారము నిమిత్తమై దేవుని వాక్యమును నిరర్థకము చేయుచుండిరి" (15:6). ప్రవక్తయైన యెషయా పలికిన మాటలను వినియోగించుచు, యేసు, "మనుష్యులు కల్పించిన పద్ధతులు దైవోపదేశములని బోధించుచు, వారు నన్ను వ్యర్థముగా ఆరాధించుచున్నారని" ఘోషించాడు (15:9).

2. *అబద్ధ బోధకులు* (15:12-14). "పరలోకమందున్న నా తండ్రి నాటని ప్రతి మొక్కయు పెల్లగింపబడునని" యేసయ్య చెప్పాడు (15:13). "గ్రుడ్డివారై యుండి గ్రుడ్డివారికి

త్రోవ చూపుదురని" కూడ ఆయన సెలవిచ్చాడు (15:14). లేఖనానుసారమైన మూలాధారము లేనివై ప్రజాదరణ పొందిన నమ్మకములకు అనుగుణ్యమైనవై యున్నవని చెప్పుకొనుచు మనము బైబిలు సంబంధమైన సిద్ధాంతములను వదిలిపెట్టకూడదు.

3. *అపవిత్రమైన జీవితము* (15:10, 11, 17–20). "నోటినుండి బయటికి వచ్చునవి, మనుష్యుని అపవిత్రపరచునని" యేసు ఉపదేశించాడు (15:11); "నోటి నుండి బయటికి వచ్చునవి హృదయములో నుండి వచ్చును, ఇవే మనుష్యుని అపవిత్రపరచును" (15:18). ఆ తరువాత ఆయన మనుష్యుని చెడ్డ హృదయములో నుండి బయటికి వచ్చి వానిని అపవిత్రపరచు పాపముల జాబితానిచ్చాడు: "దురాలోచనలు, నరహత్యలు, వ్యభిచారములు, వేశ్యాగమనములు, దొంగతనములు, అబద్ధసాక్ష్యములు, దేవదూషణలు" (15:19).

4. *అల్పవిశ్వాసము* (15:21–28). కానాను స్త్రీ ఆమె కలిగియుండిన విశ్వాసము మరియు తన కుమార్తె యెడల ఆమెకుండిన ప్రేమనుబట్టి ఆమె ప్రదర్శించిన పట్టుదలకు ప్రతిఫలముగా గొప్పగా దీవింపబడినది. ఆమె విశ్వాసము "గొప్పదై యుండినదని" ప్రశంసింపబడినది (15:28). దీనికి తారతమ్యముగా, యూదులలో అనేకులు యేసు ఉపదేశించిన బోధలను మరియు ఆయన చేసిన అద్భుతకార్యములను తృణీకరించారు. అప్పుడప్పుడు, తన సొంత శిష్యులు సహితము వారి "అల్ప విశ్వాసమునుబట్టి" గద్దింపబడ్డారు (6:30; 8:26; 14:31; 16:8; 17:20).

5. *సంక్లిష్టమైన మన జీవన శైలి* (15:32–39). ప్రజల దృష్టి అంతా యేసుపై కేంద్రీకరింపబడి యుండినది గనుక వారు ఆహారము లేదా సకల ప్రాణులు కోరుకొను సుఖసౌకర్యములతో నిమిత్తము లేకుండా ఆయనతో కూడ మూడు దినములుండిరి. వారు ఆధ్యాత్మిక ఆహారము కొరకు ఆకలిగొనుచు తృష్ణగొనుచుండిరి. యేసును వెంబడించకుండునట్లు మనలను ఏది ఆటంకరచగలదు? ఈ లోక లక్ష్యములు మరియు అభిలాషలపైనే దృష్టి సారించుట ద్వారా మనము సులభముగా మార్గము తప్పినవారమౌదుము.

## పారంపర్యాచారము (15:1–9)

సుప్రసిద్ధ చరిత్రకారుడు మరియు తత్వవేత్తయైన విల్ డ్యురంట్ ఒకసారి ఇలా వ్యాఖ్యానించాడు, "పారంపర్యాచారము కాలము యొక్క బూరయై యున్నది, కాలము ఎంపిక యొక్క మాధ్యమై యున్నది; అప్రమత్తముగా నుండు మనస్సు వాటి తుది తీర్పును ఆదరించి గౌరవించును, ఏలయనగా ఇరవై శతాబ్దముల కంటె ఉత్తమంగా యౌవనమే ఎరుగును."[24]

మత్తయి 15:1–9, సత్యము మరియు పారంపర్యాచారము మధ్య కొనసాగుచున్న పురాతనమైన సంఘర్షణ ప్రధానంగా ప్రదర్శించుచున్నది. యేసు దైవికమైన సత్యము గూర్చి ఆందోళన చెందుచుండెను, కాని ఆయనకు శత్రువులైనవారు మానవ కల్పితములైన పారంపర్యాచారములు గూర్చి అత్యధికంగా అందోళనచెందుచుండిరి. అట్లయినప్పటికిని, శిష్టాచారముగా చేతులు కడుగుకొను అభ్యాసమును ఆయన తృణీకరించినప్పుడు, ఆయన సమస్త సాంప్రదాయములను ఖండించలేదు. బైబిలు సంబంధమైన రికార్డుల ప్రకారము, ఆయన పస్కా పండుగలో కనీసము మూడు పర్యాయములైనా పాల్గొన్నాడు. ఆయన

సబ్బాతు దినమున "తన వాడుక చొప్పున" సమాజమందిరములోనికి వెళ్లాడు (లూకా 4:16). ఆయన యెరూషలేమునకు సమీపమున దాని చుట్టుప్రక్కలనే ఉన్నప్పుడు, ఆయన దేవాలయములోనికి వెళ్లుచుండెను. ఈ వాడుకలలో కొన్ని ధర్మశాస్త్రము సెలవిచ్చుచుండిన ఆజ్ఞలై యున్నవని వాదింపబడవచ్చును, మరియు అది నిజమై యుండగా, యింకను అవి మతసంబంధమైన సాంప్రదాయములై యుండెను.

మనము సమస్త సాంప్రదాయములను తృణీకరించలేము. దేవుని ద్వారా ఇవ్వబడిన వాటిని అనివార్యముగా అనుసరించవలసినదే (1 కొరింథీయులకు 11:2; 2 థెస్సలొనీకయులకు 2:15; 3:6). మానవ కల్పితములైనవి, అవి ఎవరి మీదనైనను బలవంతముగా రుద్దబడకూడనివైనప్పటికిని, వాటిని అలాగే ఉంచుకొనుట ఉచితమౌను. ఏలయనగా మానవ కల్పితములైన పారంపర్యాచారములలో ఎంతో కొంత విలువ ఉంటుంది కాబట్టి అవి పురాతనమైనవని చెప్పి వాటిని అంత సులభంగా కొట్టివేయరాదు.

ప్రమాదమనునది ఒక పారంపర్యాచారమును పాటించుటలో లేదు; మానవ కల్పితములైన పారంపర్యాచారములే ధర్మశాస్త్రమని పరిగణింపబడునట్లు అనుమతించుట లేదా దేవుడిచ్చిన నియమములను వదిలిపెట్టుటలోనే ప్రమాదమున్నది. 15:1–9లో వ్రాయబడినట్లు, పరిసయ్యులు వారి పారంపర్యాచారములను దేవుని ఆజ్ఞల కంటే ఎక్కువ ప్రాముఖ్యమైనవాటిగా చేయుట గూర్చియే యేసు అత్యధికంగా ఆందోళనచెందుచుండెను. కాబట్టి ప్రజలు ఇలా పాటించినపుడెల్లా, వారు పాపము గూర్చిన అపరాధిత్వ భాగముగల వారగుచున్నారు.

## చేతులు కడుగుకొనుట (15:2, 11)

ఈ రోజుల్లో ప్రబలముగా ప్రబలియున్నక్రిముల స్వభావము మనమెరిగినదే గనుక భోజనము చేయుటకు ముందు చేతులు కడుగుకొనుటను ఖండించలేదు, సరికదా చేతులు కడుగుకొననివాడు అనారోగ్యస్తుడు కాడని ఆయన ధ్వనించలేదు. వ్యక్తిగత ఆరోగ్య సూత్రాదులు కంటె ఎక్కువగా శిష్టాచార సంబంధమైన పవిత్రతకు ప్రాముఖ్యత ఇవ్వబడిన యూదుల అభ్యాసము గూర్చి ఆయన చర్చించుచుండెను.

## వ్యర్థ ఆరాధన (15:7–9)

దేవునికి మన హృదయములు కావలసియున్నది, కేవలం మొక్కుబడిగా చేయబడు ఆరాధన కాదు (రోమీయులకు 10:9, 10). మనము మన హృదయాంతరాళములో నుండి ఆయనను ప్రేమింపవలెనని (22:37), పాటలు పాడవలెనని (కొలొస్సయులకు 3:16), విధేయతతో లోబడవలెనని (ఎఫెసీయులకు 6:6), మరియు ఇవ్వవలెనని (2 కొరింథీయులకు 9:7) ఆయన ఆశించుచున్నాడు. "ఆత్మతోను మరియు సత్యముతోను" చేయబడు ఆరాధన సహితము అంతరంగములో నుండి పెల్లుబుకవలెను (యోహాను 4:23, 24).

యథార్థమైన ఆరాధనకు తారతమ్యముగా, "వ్యర్థమైనది" అని యేసు పిలిచిన మతసంబంధమైన కార్యకలాపమున్నది. మనము ఆరాధనగా ఆయనకర్పించుటకు ఎంపికచేసికొను దేనినైనా అంగీకరించు కృపాభరితుడైన దేవుడై యున్నాడని వారు ఎంచుదురు. అసలు విషయము అది కాదు (మలాకీ 1:7–9).

నిర్దిష్టముగా చెప్పుకొంటే, ఈ వేషధారుల ఆరాధన "వ్యర్థమైనదై" ("అయోగ్యమైనదై," "నిరర్థకమైనదై") యుండినది ఏలయనగా వారు "మానవులు కల్పించిన పద్ధతులను దైవోపదేశములని బోధించుచుండిరి" (15:9). నేడు అనేక మానవ కల్పితములైన సిద్ధాంతములు బోధింపబడుచు, దేవుని వాక్యము కంటె అగ్రస్థానమీయబడుచున్నవి. ఇటువంటి అబద్ధ సిద్ధాంతములను వ్యాపింపజేయువారు దేవుని వ్యర్థముగా ఆరాధించుచున్నవారే.

### ఆరాధన (15:7–9)

"ఆరాధన" "దైవత్వము యెడల పూజనీయమైన ప్రేమ మరియు అంకిత భావముతో కూడినదై యున్నది ... ప్రచండమైన అంకితభావము; వల్లమాలిన అభిమానం."[25] నిర్వచనము ననుసరించి, ఆరాధన దేవునిపైనే కేంద్రీకృతమైనదై యుండవలెను, మానవ కేంద్రీకృతమైనది కాదు. ఆరాధన అనగా దేవుడు మరియు ఆయన కుమారుడు మన యెడల చేసిన మరియు చేయుచున్న సమస్తము కొరకు స్తుతులు అర్పించుటయై యున్నది. మనము "తండ్రీ, నీకు వందనములు!" మరియు "యేసూ, నీకు వందనములు! నీవు మా యెడల ఎంతో దయామయుడవై యున్నావు" అని చెప్పుటకు మనకున్న ఒక తరుణమై యున్నది. ఆరాధన కేవలము మనము మంచి ఆనందానుభూతిని అనుభవించుట కొరకు కాదు, నిశ్చయముగా, దేవునితట్టు నిర్దేశింపబడు యథార్థమైన ఆరాధన, ఆరాధించువానిని అనురాగము, ఆనందము, మరియు సమాధానముతో ముంచెత్తును; అయితే ఇవన్నియు మన అధ్యాత్మిక అంకిత భావము యొక్క అనుబంధ ఉత్పత్తులై యున్నవి.

మన హృదయము చిత్తశుద్ధిగలదై యున్నంత వరకు, ఒక సభలో మనము దేవుని ఆరాధించు రీతి ముఖ్యంకాదని ఈ రోజుల్లో అనేకులు నమ్ముదురు. ఆరాధించువారు జాజ్, దేశవాళీ లేదా మరొక తీరైనా సంగీతమును కోరుకొనుచున్నట్లయితే, అది మంచిదే. పాటలు ఎవరైనా ఒక్కరు పాడుట, లేదా గాయక బృందము పాడుట వారికిష్టమైనట్లయితే, అది కూడ మంచిదే. సంగీత వాయిద్యములు వాయించబడుట, లేదా ఒక గుంపువారు చేపట్టు సంగీతవాయిద్యముల అనుకరణ మంచిదే అని వారనుకొందురు. ప్రసంగము చేయబడుటకు బదులుగా, అదే ప్రసంగము ఒక నాటక రూపంలో అందించబడినా, దానిని కూడ ఇష్టపడుదురు. ఆరాధన, ఒక వినోదము కాదు! అది మనుష్యులను సంతోషపెట్టుట కొరకు రూపొందింపబడలేదు; అది దేవుని సంతోషపర్చుటకు రూపొందింపబడినది.

దేవునికి ఎల్లప్పుడు ఒక ఆరాధనా ప్రణాళిక ఉండినది. ఈ రోజుల్లో ఆయనకు అటువంటిదేదియును లేదని అనుకొనుట, అది హేతుబద్ధము కానిదియు, లేఖనానుసారము కానిదియునై యున్నది. కయీను మరియు హేబెలు ఆయనకు ఏ విధమైన అర్పణ తీసికొనిరావలెనో దేవుడు వారికి చెప్పినట్లు స్పష్టమగుచున్నది (హెబ్రీయులకు 11:4). హేబెలు తదనుసారంగా చేసాడు, కానీ కయీను అతని ఆలోచన మేరకు అర్పించవలెనని ఎంపిక చేసికొన్నాడు. దేవుడు హేబెలు అర్పణను అంగీకరించాడు, కయీను అర్పణను తృణీకరించాడు (ఆదికాండము 4:3–7), నాదాబు మరియు అబీహు, అహరోను కుమారులు మరియు యాజకులు (నిర్గమకాండము 24:9, 10). "యెహోవా తమకు ఆజ్ఞాపింపని వేరొక అగ్నిని, ఆయన సన్నిధిలో అర్పించినప్పుడు" వారు పరలోకము నుండి దిగివచ్చిన

అగ్ని చేత కాల్చివేయబడిరి (లేవీయకాండము 10:1, 2). ధూపద్రవ్యములు మండించుటకు బలిపీఠము మీద నుండి దూపార్తితో తీసికొనబడిన నిప్పులుంచవలెనని దేవుడు నిర్దిష్టముగా తెలియజెప్పియుండెను, మరియు వారు ఈ విధంగానే చేసారని అనేక మంది పండితులు అంగీకరింతురు. "వేరొక అగ్ని" అది ఏదైనా, దాని అర్థమేమైనా, అది మోషే కాలములోని దేవుని ఆరాధనా ప్రణాళికలో ఒక భాగం కాదు; నాదాబు మరియు అబీహు వారి అవిధేయతకు ఎంతో మూల్యం చెల్లింపవలసి వచ్చినది (ప్రాణాలు కోల్పోయారు). ఆది సంఘము దేవుని ఆరాధించుటకు అనుసరించిన దాని ద్వారా, ఆమోదింపబడిన అపొస్తలుల ఆరాధనా విధానము ద్వారా, మనము ఆరాధనా విధానమును నేర్చుకొనుచున్నాము (అపొస్తలుల కార్యములు 2:42; 20:7; 1 కొరింథీయులకు 11:20-34; 14:15; 16:2). ఆది సంఘము, ప్రేరేపింపబడిన వారి నిర్దేశనము ప్రకారము ప్రతి ప్రభువు దినాన పాటలు పాడుచు, ప్రార్థనలు చేయుచు, కానుకలు అర్పించుచు, ప్రభురాత్రి భోజనములో పాల్గొనుచు, మరియు దేవుని వాక్యములో నుండి అందించబడిన సందేశమును వినుట ద్వారా దేవున ఆరాధించియున్నట్లయితే, ఈ మాదిరిని మార్చుటకు మనకు హక్కెవరిచ్చారు, అది ఎక్కడ నుండి వచ్చినది?

"ఆయనను [దేవుని] ఆరాధంచువారు ఆత్మతోను సత్యముతోను ఆరాధింపవలెనని" యేసు సెలవిచ్చాడు (యోహాను 4:23, 24). "సత్యముతో" ఆరాధించుట అనగా, సత్యమై యున్న దేవుని వాక్యానుసారముగా ఆరాధించుట యని అర్థము (యోహాను 17:17), ఆత్మతో ఆరాధించుట అనగా, ఆత్మలో నుండి (అంతరంగములో నుండి) ఆరాధించుట యని అర్థము.[26] కేవలము బాహ్య కదలికలు పాటించుట (మలాకీ 1:6-14 చూడు) చాలదు. మనము ఆత్మతో ఎలా ఆరాధించగలము? మొదటిది, మన ఆలోచనలు దేవుని మీద కేంద్రికరింపబడి యుండవలెను. రెండవది, మనకు ఉపదేశింపబడు సత్యములను మనము ధ్యానించవలెను. మూడవది, దేవుని సంతోషపర్చవలెనను తీవ్రమైన ఆతురతగల అభిలాష కలిగియుండవలెను. నాలుగవది, మన ఆరాధన మనఃపూర్వకమైనదై యుండవలెను. ఉత్తమమైన స్వరములతో గాన ప్రతిగానములు చేయబడకపోయినా, అత్యంత వేగవంతమైన వాగ్ధాటితో కూడిన ప్రార్థనలు చేయబడకపోయినా, మనము మన్నింపబడగలము, కానీ మనము నిజాయితీలేనివారమై యుండజాలము.

దేవుడు అబద్ధపు, మూర్ఖపు, నిరర్ధకమైన, మరియు స్వయంపొగడ్తలతో కూడిన ఆరాధనను ఖండించును. సమస్త విధములైన ఆరాధనలు దేవుని అంగీకారములు కావని స్పష్టమగుచున్నది. నీవు ఆరాధించువాడు దేవుడు కానప్పుడు, మన సొంత ప్రామాణికముల ప్రకారము విధేయతతో చేయుటకు విఫలులమైనప్పుడు, లేదా మన ఆరాధనా శైలి దేవుడు ఆజ్ఞాపించిన క్రమము ననుసరించుచున్నది కానప్పుడు అట్టి ఆరాధన ఆయనకు అనంగీకారమైనదగును.

### మనము ఎవరి మాట వినుచున్నాము? (15:12-14)

యేసు శిష్యులు పరిసయ్యులు అనగా అనేక మంది యూదుల చేత అత్యున్నతముగా ఆదరింపబడినవారి అభిప్రాయముల గూర్చి అపరిమితముగా ఆందోళన చెందుచుండిరి. అట్లయినప్పటికిని, ఆయనను వెంబడించుచుండిన వారితో యేసు, "వారి జోలికి పోకుడి;

వారు గ్రుడ్డివారైయుండి గ్రుడ్డివారికి త్రోవచూపువారు” అని తెలియజెప్పాడు (15:14). అబద్ధ బోధకులైన వీరిని అనుసరించుట వలన, ఒకడు తన సొంత నాశనమునకే కారకుడగును. ఈ రోజుల్లో, మనము కూడ అబద్ధ బోధకుల గూర్చి అతిజాగ్రత్తపరులమైయుంటూ, దేవుని వాక్యములో నుండి ఇతరులు బోధించు విషయముల ప్రామాణికత్వమును అంచనావేసుకొనవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. అదొక్కటే క్రైస్తవ విశ్వాసమునకు వస్తుగతమైన ప్రమాణమై యున్నది.

డేవిడ్ స్టూవర్ట్

---

సూచనలు

[1]అంతియొకస్ (“ఎపిఫనేస్,” అనగా “ప్రత్యక్షమగుచున్న దేవత” అని అర్థమిచ్చు పేరుతో) తనను తాను పిలుచుకొనినవాడు, క్రీ.పూ. రెండవ శతాబ్దములో సెల్యూసిడ్ సామ్రాజ్యమునకు పరిపాలకుడై యుండెను. పాలస్తీనా దేశమును జయించినవానిగా అతడు చేసిన కార్యములు, యూదులు అతని మీదికి మక్కాబియన్ తిరుగుబాటు చేయునంతగా ఎంతో హాని కలిగించునవై యుండినవి. [2]David Hill, *The Gospel of Matthew*, The New Century Bible Commentary (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1972), 250. [3]Leon Morris, *The Gospel according to Matthew*, Pillar Commentary (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1992), 389. [4]Mishnah *Aboth* 1.1. [5]Ibid. [6]Robert H. Mounce, *Matthew*, New International Biblical Commentary (Peabody, Mass.: Hendrickson Publishers, 1991), 148. [7]Josephus *Antiquities* 13.10.6 (emphasis added). [8]“తోరా ఉపదేశించు బోధల కంటే శాస్త్రులు ఉపదేశించు బోధలకు ఇంకా ఎక్కువ నిక్కచ్చియైన నియమము వర్తించుచున్నది” (Mishnah *Sanhedrin* 11.3; Talmud *Abodah Zarah* 35a; *Erubin* 21b చూడు. [9]Morris, 391. [10]Mishnah *Yadaim* 2.3.

[11]Michael J. Wilkins, “Matthew,” in *Zondervan Illustrated Bible Backgrounds Commentary,* vol. 1, *Matthew, Mark, Luke,* ed. Clinton E. Arnold (Grand Rapids, Mich.: Zondervan, 2002), 95. “మలీనమైనవాడొకడు మందిర సేవలకు ఎలా పనికిరాడో, అలాగే భోజనము దగ్గర వందనములు చెల్లించుటకు మలినమైన చేతులు పనికిరావని” ఒక యూదా మత బోధకుడు సెలవిచ్చాడు. [12]Talmud *Kiddushin* 31b; Jerusalem Talmud *Kiddushin* 1.7. [13]Jerusalem Talmud *Kiddushin* 1.7. [14]Mishnah *Nedarim* 5.6. [15]Wilkins, 96. [16]Mishnah *Nedarim* 9.1. [17]Hill, 251. [18]William Hendriksen, *New Testament Commentary: Exposition of the Gospel According to Matthew* (Grand Rapids, Mich.: Baker Book House, 1973), 614. [19]Craig S. Keener, *A Commentary on the Gospel of Matthew* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1999), 412. [20]Jack P. Lewis, *A Commentary on the Gospel According to Matthew,* Part 2, The Living Word Commentary (Austin, Tex.: Sweet Publishing Co., 1976), 25.

[21]Morris, 396-97. [22]“వేశ్యాగమనములు,” “వ్యభిచారములు” వర్గముతోను, “దేవదూషణలు,” “అబద్ధ సాక్ష్యముల” వర్గముతోను చేర్చబడినవి. [23]Hill, 252. [24]Will Durant, *The Story of Civilization*, vol. 3, *Caesar and Christ* (New York.: Simon and Schuster, 1944, 1972), 295. [25]*American Heritage Dictionary,* 4th ed. (2001), s.v. “worship.” [26]యథార్థమైన ఆరాధన ఒక ప్రత్యేకమైన స్థలము (యెరూషలేము లేదా గెరాజీము పర్వతము) చేత మధ్యవర్తిత్వము వహించబడదని యోహాను వ్రాసిన సువార్త 4వ అధ్యాయంలోని సందర్భము నొక్కివక్కాణించుచున్నది, కానీ అది ఒక వ్యక్తి (యేసు క్రీస్తు) ద్వారా సంభవించును. నిజమైన ఆధ్యాత్మిక ఆరాధన ఆయన ద్వారా మాత్రమే సాధ్యమగును (యోహాను 14:6, 13, 14; 16:23, 24; ఎఫెసీయులకు 5:19, 20; కొలొస్సయులకు 3:16, 17).